
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం । 9 । ఆగస్టు । 2025



సోమశిలకు భారీగా వరద
జలాశయానికి శుక్రవారం 17,715 క్యూసెక్కులకు వరద పెరిగింది. డెల్టాకు 1200, పవర్ టన్నెల్‌కు 2400, ఉత్తర కాలువకు 370, కండలేరుకు 6 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. జలాశయంలో 38.100 టీఎంసీలు నిల్వ ఉన్నాయి.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,04,420
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,470
3 శాతం జీఎస్టీతో	రూ.9,754
నవర (8 గ్రా)	రూ.78,032

గరిష్టం/కనిష్టం
35.0 /23.9

వాతావరణం
జిల్లాలో శనివారం మేఘావృతంగా ఉండి అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. శుక్రవారం గాలిలో తేమ 59 శాతంగా నమోదైంది.




రాజరాజేశ్వరి ఆలయంలో విశేష అలంకరణలో అమ్మవారు, కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు




ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో కలశ పూజలు చేస్తున్న మహిళలు, విశేష అలంకరణలో అమ్మవారు

వరాలిమ్ము... వరలక్ష్మి

శ్రావణ శుక్రవారం సందర్భంగా సంప్రదాయాలను అనుసరించి వరలక్ష్మి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. శుభదాయకమైన ఈ పవిత్రమైన రోజున మహిళలు తెల్లవారుజామునే లేచి కలశాలను అలంకరించి, అష్టైశ్వర్యాలు కలిగించే అష్టలక్ష్ములను ఆరాధించారు. సంప్రదాయ వస్త్రధారణతో ఆలయాలను సందర్శించారు. నెల్లూరు నగరంలోని రాజరాజేశ్వరి ఆలయం, ఇరుకళల పరమేశ్వరి ఆలయం, ఫత్తేఖాన్‌పేటలోని మహాలక్ష్మి ఆలయం, మాగుంటలేవుట్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిక్కిరిసి పోయాయి. ఆలయాలన్నీ రంగురంగుల పుష్పాల తోరణాలతో అంగరంగ వైభవంగా అలంకరించారు. మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు చేసి, సువాసిత ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. ఇంటింటా వరలక్ష్మి వ్రతాన్ని ఆచరించి, కలశాలను స్వర్ణలంకారాలతో, పుష్పాలతో అలంకరించి వ్రతకథ పఠించారు. కుటుంబ శ్రేయస్సు, భర్త దీర్ఘాయువు, సంతానాభివృద్ధి కోసం మహిళలు దీక్షగా ఉపవాసం ఆచరించి అమ్మవారిని ప్రార్థించారు. పలు ఆలయాల్లో హారతులు, మంగళకరమైన భక్తిగీతాలతో ఆధ్యాత్మికత నిండిపోయింది. వరలక్ష్మి వ్రతం భక్తుల జీవితాల్లో సిరిసంపదలు నింపాలని మహిళలు ఆకాంక్షించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్స్, నెల్లూరు

న్యూస్‌రీల్

గంగా కావేరి ఎక్స్‌ప్రెస్ రైల్లో పొగలు

- బోగీల్లోంచి దూకేసిన ప్రయాణికులు



రైలు దిగి వెళ్లిపోతున్న ప్రయాణికులు

మనుబోలు: బిహార్‌లోని చాప్రా నుంచి చెన్నై వెళ్తున్న గంగా కావేరి (నంబరు 12670) ఎక్స్‌ప్రెస్ రైల్లో బ్రేక్ బైండింగ్ కారణంగా పొగలు రావడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. డ్రైవర్ అప్రమత్తమై రైలు ఆపడంతో ప్రయాణికులు బోగీల్లోంచి దిగేశారు. ఈ ఘటన మనుబోలు సమీపంలో రైల్వే ట్రాక్‌పై శుక్రవారం జరిగింది. రైలు మనుబోలు చెరువు సమీపంలోకి వచ్చే సరికి ఇంజిన్ వెనుక బోగీ కింద నుంచి భారీగా పొగలు రావడంతో గమనించిన డ్రైవర్ ఆపారు. సమాచారం అందుకున్న రైల్వే సాంకేతిక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మరమ్మతులు చేపట్టారు. సుమారు అర్ధగంట పాటు రైలు ఆగిపోయింది. మరమ్మతుల అనంతరం రైలు చెన్నై బయలుదేరింది. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరిగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కొందరు ప్రయాణికులు నడుచుకుంటూ కాగితాలపూరు క్రాస్‌రోడ్డు, మనుబోలుకు చేరుకుని గమ్యస్థానాలకు వెళ్లారు.

ఉత్సాహంగా క్రీడాకారుల ఎంపిక



బాస్కెట్ బాల్ ఎంపికల్లో క్రీడాకారులు, అధికారులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహించే ఎంపికల్లో క్రీడాకారులు ఉత్సాహంగా హాజరయ్యారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రెండో రోజు శుక్రవారం బాస్కెట్ బాల్, ఖోఖో, హాకీ, వాలీబాల్ క్రీడాంశాల్లో 22 ఏళ్ల లోపు స్త్రీ, పురుషుల క్రీడా జట్ల ఎంపికలకు 305 మంది క్రీడాకారులు హాజరయ్యారని డీఎస్‌డీఓ ఆర్‌కే యతిరాజ్ తెలిపారు. శనివారం ఉదయం 9 గంటలకు బ్యాడ్మింటన్ క్రీడాంశంలో క్రీడా పోటీలు, జిల్లా జట్ల ఎంపికలను నిర్వహించనున్నామన్నారు.

190 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

- సివిల్ సప్లయిస్, పోలీసుల సంయుక్త తనిఖీ



సీజ్ చేసిన రేషన్ బియ్యం వాహనం

కోవూరు: నెల్లూరు– ముంబై జాతీయ రహదారిలో ఆత్మకూరు వైపు నుంచి కోవూరు వైపు వెళ్తున్న వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 190 బస్తాల రేషన్ బియ్యాన్ని సాలుచింతల వద్ద సివిల్ సప్లయిస్, పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. అనంతసాగరం నుంచి కోవూరు మండలంలోని ఒక రైస్ మిల్లుకు ఈ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ బాలకోటమ్మ, కోవూరు ఎస్సై రంగనాథ్‌గౌడ్ ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం తనిఖీలు చేపట్టారు. ఓ వాహనంలో రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. బియ్యంతోసహా వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సివిల్ సప్లయిస్ గోదాముకు తరలించారు.

అపచారంగా..!

పవిత్ర పినాకినీ తీరాన సింహపురి క్షేత్ర పాలకుడిగా రంగనాథుడు కొలువై ఉన్నాడు. అయన స్వయంభువుగా ప్రతీతి. దక్షిణ వైకుంఠంగానూ విరాజిల్లుతున్న క్షేత్రమిది. అంత ప్రశస్తి కలిగిన ఈ క్షేత్రంలో స్వామి నిత్య కైంకర్యాల్లో అపచారం జరుగుతోంది. ఇక్కడ నదిలోని మురికి నీటిన్ని తెచ్చి భక్తులకు తీర్థంగా ఇవ్వాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆ దేవదేవుడికి జరిగే నిత్యాభిషేకాల్లో అపవిత్రపు నీరే దిక్కవుతుండడం భక్తహృదయాలను కలిచివేస్తోంది. పవిత్ర పెన్నానది వ్యర్థ జలాలతో కలుషితంగా మారుతోంది. స్వామి వారి ఆలయం పక్కనే ఉన్న పెన్నా ఘాట్ నుంచి అర్చకులు పవిత్రమైన అభిషేక జలాలు తెచ్చేందుకు ప్రయాసపడిపోతున్నారు. దేవదాయశాఖ అధికారుల నిర్లక్ష్యం, పాలకుల మౌనం ఈ అపచారానికి అనివార్యమవుతోంది. పంచభూతాల్లో పవిత్రమైన జలం అపవిత్రానికి మచ్చుతునకలా మారింది.




పెన్నానదిలో పేరుకుపోయిన గుర్రపుడెక్క మురుగులోనే ప్రమాదం అంచున అభిషేక జలాలు సేకరిస్తున్న అర్చకులు



తల్పగిరి రంగనాథస్వామి ఆలయ గోపురం

- కలుషిత, వ్యర్థ జలాలతో అపవిత్రమవుతున్న పెన్నానది
- పట్టించుకోని పాలకులు, ఆలయ అధికారులు
- 'రంగడి' సేవకు అర్చకుల అవస్థలు

» మురికి నీటితోనే రంగనాథునికి అభిషేకాలు



పవిత్ర పినాకినీ తీరంలో శిథిలమై గుర్రపు డెక్క పేరుకుపోయిన రంగనాథుడి ఆలయ ఘాట్ మూసివేత



నది నీటిని వస్త్రంతో వడగట్టుతున్న అర్చకులు

నెల్లూరు (బృందావనం): త్రికుండాల్లో ఒకటిగా, కస్యప మహర్షి యాగ స్థలిగా, దక్షిణ శ్రీరంగంగా ప్రసిద్ధిగాంచిన తీర్థంగా, పవిత్ర పినాకినీ తీరం రంగనాయకులపేటలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథ స్వామి వారి క్షేత్రంలో నిత్య కైంకర్యాలకు అపవిత్ర జలాలే దిక్కుగా మారాయి. దేవతామూర్తులకు తిరుమంజనం (అభిషేకం), భక్తులకు పూజా నైవేద్య తీర్థం కోసం తెచ్చే జలాలు అపవిత్రంగా ఉండడంతో అర్చకులే ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.

పినాకినీ నది జలాలతో అభిషేకాలు

శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ క్షేత్రంలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి, రంగనాయకి, ఆండాళ్ అమ్మవార్లు, వేంకటేశ్వరస్వామి, ఆళ్వార్లు తదితర దేవతామూర్తులకు పవిత్ర పినాకినీ నది జలాలు పరమ పవిత్రంగా నిత్య కైంకర్యాల్లో వినియోగించేవారు. స్వామి వార్ల పాదోదకం (తీర్థం)గా భక్తులకు ఇస్తున్నారు. అటువంటి పవిత్రమైన నది కాలక్రమేణా నదీ తీరంలోకి వ్యర్థ జలాలు వదిలేస్తుండడంతో కలుషితంగా మారుతోంది. దేవతామూర్తుల అభిషేకాలకు జలాలను సేకరించేందుకు ఆలయం వెనుక వైపు నదిలో ప్రత్యేకమైన ఘాట్ ఉంది. అర్చకులు అక్కడి నుంచి జలాలు తెచ్చి తిరుమంజన సేవలు నిర్వహించే వారు. అయితే ఆ ప్రాంతం అంతా గుర్రపు డెక్క పెరిగి ఆ పరిసరాలు అపరిశుభ్రంగా, నది జలాలు కలుషితంగా మారాయి. దీంతో ఆ మార్గం గేట్లకు తాళం వేసి మూసివేశారు. మరో పక్కన ఆలయానికొచ్చే భక్తులు ఘాట్‌లో స్నానమాచరించి దర్శించుకోవడం పరిపాటి. దీంతో పక్కన ఇనుప చువ్వలతో ప్రమాదకరంగా మారిన అసంపూర్తిగా ఉన్న పెన్నా ఘాట్ నుంచి అర్చకులు నదీ జలాలు తెస్తున్నారు. ఆ నీరు కలుషితంగా ఉండడంతో అర్చకులు కలశ బిందెలకు వస్త్రాన్ని కట్టి జలాలు సేకరిస్తున్నారు. ఆ నీటినే పరమపవిత్రంగా సేవిస్తున్నారు.

దేవదేవుడి సేవల్లో నిర్లక్ష్యమేలా?

దేవదేవుడికి నిత్యం జరుగుతున్న అపచారంపై దేవదాయశాఖ అధికారుల నిర్లక్ష్యం, అమాత్యులు మౌనం దాల్చడంపై అర్చకులు మదన పడిపోతున్నారు. స్వామివార్లను అభిషేకించిన జలాలను స్వామి పాదోదకంగా భావించే అర్చకులు, అదే జలాలను భక్తులకు తీర్థంగా ప్రస్తుతం అపవిత్ర జలాలు వినియోగించడంపై అర్చకులన కలిచివేస్తోంది. రంగనాథుడి ఆలయానికి ఎదురుగానే దేవదాయశాఖ కమిషనర్ కార్యాలయం ఉంది. కూతవేటు దూరంలోనే రాష్ట్ర దేవదాయ, ధర్మదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నివాసం ఉండడం, రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గ పరిధిలోనే ఉన్నా.. అందరూ నిర్లక్ష్యం వహించడంపై భక్తులు మండి పడుతున్నారు.

నేనేమి చేయలేను

అర్చకులు పడుతున్న అవస్థలు, అపరిశుభ్రంగా ఉన్న పరిస్థితి నాకూ తెలుసు. నేనేమి చేయగలను. పడమటి గాలికొడుతోంది. గుర్రపు డెక్క ఆకు తొలగించాలని ఉన్నతాధికారులకు, ఇరిగేషన్ శాఖ అధికారులకు చెప్పలేదు. ఇరిగేషన్ శాఖ వారే గుర్రపు డెక్క ఆకు తొలగించాలి. నేను చెబితే ఇరిగేషన్ అధికారులు నా మాట వింటారా?. ప్రజాప్రతినిధులే చూసుకోవాలి.

– ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, ఈఓ, రంగనాథస్వామి ఆలయం

మూడు నెలల్లోగా పెన్నా ఘాట్ పూర్తి

- మంత్రి నారాయణ

నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని శ్రీదేవి,భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి వారిని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ శుక్రవారం దర్శించుకొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పెన్నానది ఘాట్‌ను పరిశీలించారు. ఘాట్ పరిధిలోని గుర్రపు డెక్కను తొలగించడంతోపాటు మూడు నెలల్లోగా పెన్నాఘాట్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షం వచ్చిన సమయంలో డ్రైనేజీ నీరు దేవస్థానంలోకి వస్తోందని అర్చకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా సోమవారంలోగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.



పెన్నాఘాట్ వద్ద పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

'పచ్చ' కుట్రలు.. ఖాకీల అమలు

- మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటనలో పాల్గొన్నాడని..
- వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అనూప్‌రెడ్డి అరెస్ట్
- అర్ధరాత్రి పూట భారీగా బలగాలు చుట్టుముట్టి అలజడి

కోవూరు/నెల్లూరు (క్రైమ్) : పచ్చ కుట్రలను అమలు చేసే క్రమంలో కోవూరులో అర్ధరాత్రి పూట పోలీసులు రాజకీయంగా అలజడి సృష్టించారు. గత నెల 31న నెల్లూరులో జరిగిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటనలో పాల్గొన్నాడని వైఎస్సార్‌సీపీ కోవూరు మండల అధ్యక్షుడు అత్తిపల్లి అనూప్‌రెడ్డిని గురువారం అర్ధరాత్రి భారీగా బలగాలను మోహరించి అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గురువారం రాత్రి అనూప్‌రెడ్డి హైదరాబాద్ వెళ్తున్న తన భార్యను బస్సు ఎక్కించేందుకు చౌదరి పెట్రోల్ బంకు వద్దకు వచ్చాడు. అక్కడి నుంచి తిరిగి ఇంటికి వచ్చిన సమయంలో సివిల్ డ్రెస్‌లో ఉన్న ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చారు. తాము నెల్లూరు దర్గామిట్ట ఐడీ పార్టీ పోలీస్‌లమని చెప్పి సీఐ తీసుకు రమన్నారని బైక్‌పై ఎక్కించుకున్నారు. అకస్మాత్తుగా భారీగా పోలీసు బలగాలు ఆయన ఇంటికి చేరుకోవడంతో పరిసరాల్లో కలకలం రేగింది.

వైఎస్ జగన్ పర్యటన విజయవంతం కావడంతో..

గతనెల 31వ తేదీన మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటన విజయవంతం కావడంతో టీడీపీ నేతలు జీర్ణించుకోలేకపోయారు. ఆయన పర్యటనను అడ్డుకునేందుకు పోలీసులు ఎక్కడిక్కడ పార్టీ ముఖ్య నేతలకు నోటీసులిచ్చారు. అయినా పోలీసుల ఆంక్షలను పట్టించుకోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. ఈ క్రమంలో మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటికి సమీపంలో భారీగా తరలివచ్చిన పార్టీ క్యాడర్‌ను అడ్డుకున్నారు. ఈ క్రమంలో కావలి ఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్ మాలకొండయ్య కింద పడడంతో చేయి విరిగిందని కోవూరు ప్రసన్నకుమార్‌రెడ్డి, బొబ్బల శ్రీనివాస్‌యాదవ్, పాతపాటి ప్రభాకర్‌తోపాటు మరికొందరిపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదే కేసులో వైఎస్సార్‌సీపీ కోవూరు మండల అధ్యక్షుడు ఎ.అనూప్‌రెడ్డితోపాటు మరికొందరి పేర్లను కేసులో చేర్చి గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం అర్ధరాత్రి కోవూరు చౌదరి పెట్రోల్‌బంకు సమీపంలో అదుపులోకి తీసుకుని శుక్రవారం ఆయన్ను అరెస్ట్ చూపించి కోర్టుకు హాజరు పరిచారు.

తొమ్మిది ఆలయాలకు పాలక మండళ్లు

నెల్లూరు(బృందావనం): జిల్లాలోని తొమ్మిది దేవస్థానాలకు పాలక మండళ్ల (ట్రస్ట్ బోర్డులు) ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా దేవదాయశాఖ అధికారి కోవూరు జనార్దన్ రెడ్డి శుక్రవారం తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి, నెల్లూరు నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి, మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వర స్వామి, దేవరపాళెంలోని వేదగిరిలక్ష్మీనరసింహస్వామి, బోగోలు మండలం కొండబిట్రగుంటలోని ప్రసన్నవేంకటేశ్వరస్వామి, ముత్తుకూరు మండలం కృష్ణపట్నంలోని సిద్దేశ్వర, వేణుగోపాలస్వామి, రాపూరు మండలం గోనుపల్లి పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి, వలేటివారి పాళెం మండలం మాలకొండలోని మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి, దుత్తలూరు మండలం నర్రవాడలోని వెంగమాంబ పేరంటాళ్ల అమ్మవారి ఆలయాలకు పాలక మండళ్ల ఏర్పాటు కానున్నాయన్నారు.

జల్‌జీవన్ మిషన్ పథకం శిలాఫలకం ధ్వంసం



జల్‌జీవన్ పథకం శిలాఫలకాలు (ఫైల్)

కావలి (జలదంకి): కావలి మండలం తుమ్మలపెంటలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్ పథకం నిర్మాణానికి ఆవిష్కరించిన శిలాఫలకాన్ని గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గతంలో వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.33 కోట్ల నిధులతో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలనే లక్ష్యంతో పథకానికి శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కొంతమేర పనులు జరిగాయి. తర్వాత ఎన్నికలు రావడంతో ఆ పనులు నిలిచిపోయాయి. అయితే శిలాఫలకంలో వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకుల పేర్లు ఉన్నాయి. దీన్ని జీర్ణించుకోలేని టీడీపీ శ్రేణులు శిలాఫలకాన్ని రాత్రికి రాత్రి కూల్చి వేశారని స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపించారు.



దుండగులు కూల్చివేసిన శిలాఫలకాలు

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో..



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

రాపూరు: వరలక్ష్మీవ్రతం సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఏటా కోనలో వ్రతం నిర్వహించడం జరుగుతోందని ప్రధానార్చకులు సీతా రామయ్యస్వామి, పెంచలయ్యస్వామి తెలిపారు. ఆదిలక్ష్మీదేవి ఉత్సవ విగ్రహాన్ని పద్మ పీఠంపై కొలువుదీర్చి వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో వరలక్ష్మీదేవిగా అలంకరించారు. మహిళల చేత అర్చకులు వరలక్ష్మీవ్రతం చేయించారు.

నీట మునిగిన నిమ్మ, మామిడి



మామిడి తోటలో వర్షపు నీరు

సైదాపురం: మండలంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి కొన్ని ప్రాంతాల్లో నిమ్మ, మామిడి తోటలు నీట మునిగాయి. తురిమెర్ల, ఆర్వైజీ పాళెం తదితర గ్రామాల్లో విస్తారంగా నిమ్మ, మామిడి తోటలున్నాయి. వర్షాలకు మామిడి తోటల్లో నీరు నిల్వ చేరింది. ఇంకా లోతట్టు ప్రాంతాల్లోకి వరదనీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

జెడ్పీటీసీ సభ్యురాలికి కన్నీటి వీడ్కోలు



నివాళులర్పిస్తున్న అరుణమ్మ, విజయకుమార్‌రెడ్డి

దక్కిలి: వైఎస్సార్‌సీపీ దక్కిలి మండల జెడ్పీటీసీ సభ్యురాలు కలిమిలి రాజేశ్వరి అంతిమ యాత్ర శుక్రవారం జరిగింది. వైఎస్సార్‌సీపీ నాయకులు, బంధువుల మధ్య శుక్రవారం ఆమె భర్త రామ్‌ప్రసాద్‌రెడ్డి స్వగ్రామం చాపలపల్లి గ్రామంలో నిర్వహించారు. రాజేశ్వరి భౌతిక కాయాన్ని నెల్లూరు జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి విజయకుమార్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. రామ్‌ప్రసాద్‌రెడ్డిని ఓదార్చారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్:	రూ.102
లేయర్	రూ.112
బ్రాయిలర్ చికెన్:	రూ.190
స్కిన్‌లెస్ చికెన్:	రూ.212
లేయర్ చికెన్:	రూ.190

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి :	రూ.31
సన్నవి :	రూ.20
పండ్లు :	రూ.8

ఆయిల్‌పామ్ రైతుల విలవిల

ఉద్యాన పంటల్లో ప్రసిద్ధి గాంచిన ఆయిల్ పామ్ సాగు విషయంలో ప్రభుత్వ విధానాల్లో స్థిరత్వం లేక రైతులు ఆటుపోట్లు ఎదుర్కొంటున్నారు. ఇటీవల 10 శాతం దిగుమతి సుంకాన్ని తగ్గించడం సాగుదారుల పాలిట శాపంగా మారింది. దీంతో టన్ను ధర తగ్గడంతో నష్టపోతున్నారు.

- దిగుమతి సుంకాన్ని భారీగా తగ్గించిన ప్రభుత్వం
- టన్నుకు రూ.3,600 వరకు నష్టం
- ఆందోళనలో సాగుదారులు
- కనీస ధర రూ.22 వేల కోసం డిమాండ్

సాగు ఎక్కడంటే.. వింజమూరు, కొండాపురం, దుత్తలూరు, జలదంకి, ఆత్మకూరు, ఏఎస్‌పేట, వెంకటాచలం, పొదలకూరు, చేజర్ల, కలువాయి, దగదర్తి, బాలాయపల్లి, వెంకటగిరి, దొరవారిసత్రం.

ఏడు నెలలుగా ఆయిల్ పామ్ గెలల ధరలు (టన్ను)

నెల	ధర (రూ.ల్లో)
జనవరి	20,050
ఫిబ్రవరి	20,727
మార్చి	20,935
ఏప్రిల్	20,123
మే	18,650
జూన్	17,340
జూలై	17,340



మార్కెట్‌కు తరలిస్తున్న ఆయిల్‌పామ్ గెలలు

ఉదయగిరి: ఉమ్మడి నెల్లూరు జిల్లా వ్యాప్తంగా ఆయిల్‌పామ్ 7,500 ఎకరాల్లో ఉంది. జిల్లాలో పాతికేళ్ల నుంచి ఈ పంట సాగు చేస్తున్నారు. మొదట్లో సాగు బాగున్నా, మధ్యలో ధరల్లో ఒడిదుడుకుల వల్ల రైతులు క్రాప్ హాలిడే ప్రకటించారు. కొన్నిచోట్ల తోటలు తొలగించి ప్రత్యామ్నాయ పంటలు వేశారు. గత నాలుగేళ్ల నుంచి ధరలు ఆశాజనకంగా ఉండటం, ప్రభుత్వం రాయితీ ఇవ్వడంతో సాగుపై రైతులు ఆసక్తి చూపారు.

ధర పతనం

గెలల ధర పడిపోతుండటం రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాం 2022లో టన్ను గెలలకు అత్యధికంగా రూ.22,500 ధర లభించింది. ఇప్పటి వరకు ఇదే రికార్డు ధర. అయితే వివిధ కారణాలతో 2023, 2024 సంవత్సరాల్లో గెలల సగటు ధర ఏ దశలోనూ రూ.15 వేలకు చేరుకోలేదు. కాగా ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు టన్ను రూ.20 వేలు దాటింది. అయితే కేంద్ర ప్రభుత్వం పామాయిల్‌పై దిగుమతి సుంకం 27 శాతం నుంచి 10 శాతానికి తగ్గించడం రైతులకు శాపంగా మారింది. ఆయిల్ కంపెనీలు వివిధ దేశాల నుంచి తక్కువ ధరకు పామాయిల్ దిగుమతి చేసుకుంటున్నాయి. ఫలితంగా దేశీయంగా ఉత్పత్తి అవుతున్న గెలల ధర రూ.20,935 నుంచి ఏకంగా రూ.17,340కు పడిపోయింది. ప్రభుత్వం ఇలాగే దిగుమతి సుంకాన్ని కొనసాగిస్తే ధరలు మరింత దిగజారే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. కేంద్ర వ్యవసాయ ధరల నిర్ణాయక కమిటీ సూచించిన విధంగా ఆయిల్‌పామ్ గెలల కనీస ధర టన్నుకు రూ.22 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేస్తున్నారు.



ఆయిల్‌పామ్ తోటలు

రైతుల్ని ప్రోత్సహించాలి



వంట నూనెల కొరత దృష్ట్యా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్ పామ్ సాగు రైతులను ప్రోత్సహించాలి. కనీస ధర రూ.25 వేలు చెల్లించాలి. పామాయిల్ దిగుమతి సుంకాన్ని ఆయిల్‌పామ్ గెలల ధరకు ముడిపెట్టకూడదు. దీని సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్న తరుణంలో ధరల్లో తీవ్ర ఒడిదుడుకులు ప్రభావం చూపుతాయి. ఇప్పుడిప్పుడే జిల్లాలో మెట్ట ప్రాంత రైతులు సాగు వైపు మళ్లుతున్నారు. కనీస మద్దతు ధర ప్రకటించి ఆ మేరకు కొనుగోలు చేయాలి.

– బి.రామసుబ్బారెడ్డి, వింజమూరు

డిమాండ్ ఉంటుంది



ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం అనేక రాయితీలు ఇస్తోంది. ఉచితంగా మొక్కలు పంపిణీ చేస్తున్నాం. అంతర పంటల సాగుకు ఎకరాకు రూ.5,200 చొప్పున నాలుగేళ్లపాటు ఇస్తున్నాం. వింజమూరు, దుత్తలూరు మండల కేంద్రాలల్లో గెలల సేకరణ కేంద్రం ఉంది. త్వరలో కలిగిరి మండలం కొత్తపేటలో మూతబడిన ఫ్యాక్టరీని పునరుద్ధరించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మెట్ట ప్రాంత రైతులకు ఆయిల్‌పామ్ సాగు లాభాలు కురిపిస్తోంది. మన దేశంలో ఎప్పుడూ పామాయిల్‌కు డిమాండ్ ఉంటుంది. అందువల్ల ధరలపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– జయశ్రీ, ఉద్యానాధికారిణి, ఉదయగిరి

వృత్తి చేపల వేట.. ప్రవృత్తి నాటకాలు

- బ్రహ్మంగారి నాటకంలో సిద్ధయ్య పాత్రలో 80 ప్రదర్శనలు
- దర్శకుడిగా 25 గ్రూపులకు శిక్షణ

కందుకూరు రూరల్: అవనిగడ్డ నాగేశ్వరరావు.. ఈయన వృత్తి సముద్రంలో చేపలు పట్టడం.. ప్రవృత్తి స్టేజీపై నాటకాలు ఆడటం.. నేర్పించడం. బ్రహ్మంగారి నాటకంపై ఆసక్తి పెంచుకుని సిద్ధయ్య పాత్రలో నటిస్తూ.. దర్శకుడిగా కూడా రాణిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఉలవపాడు మండలం రామాయపట్నంలో పల్లెపాళేనికి చెందిన అవనిగడ్డ వెంకటేశ్వర్లు –నాగమ్మలకు పదిమంది పిల్లలున్నారు. వీరిలో మూడో సంతానమైన నాగేశ్వరరావు ఆరో తరగతి వరకే చదివాడు. నాటకాలపై ఆసక్తి పెరగడంతో పెదగంజాంకు చెందిన ఎం.సుబ్బారెడ్డి అనే గురువు వద్ద నేర్చుకున్నారు. సుదన్వార్జున డ్రామాలో నారదుడి పాత్ర వేశాడు. అందులో నాగేశ్వరరావు ప్రతిభ చూసిన గురువు బ్రహ్మంగారి నాటకంలో సిద్ధయ్య పాత్రకు సిద్ధం చేశారు. నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాలో సుమారు 80 ప్రదర్శనలిచ్చారు. సిద్ధయ్య పాత్ర చేస్తూనే బ్రహ్మంగారి నాటకంపై మంచి పట్టు సాధించి దానికి దర్శకుడిగా మారాడు. ఇలా రెండు తెలుగు రాష్ట్రాల్లో 25 గ్రూపులకు నేర్పించాడు.



బ్రహ్మంగారి నాటకంలో సిద్ధయ్య పాత్రలో నాగేశ్వరరావు

ముందుండి..

నాటక ప్రదర్శనలో ఏదైనా పాత్రకు వేషధారుడు లేకపోతే నాగేశ్వరరావు పూర్తి చేసేవాడు. కుటుంబ జీవనం కోసం చేపల వేటకు వెళ్తూనే మరోవైపు నాటకాలు నేర్పిస్తున్నాడు. బ్రహ్మంగారి నాటకం గ్రూపులో సుమారు పదిహేను మంది పాత్రధారులుంటారు. వారికి పద్యాలతోపాటు, ఆటపాటలతో నటన నేర్పించాలి. ఒక్కో గ్రూపునకు 3 నుంచి 4 నెలల వరకు సమయం పడుతుంది. ఇంటి నుంచి వెళ్లాడంటే ఆరునెలలకు ఒకసారి తిరిగొస్తాడు. అదే విధంగా గ్రామంలో ఉచితంగా పంచాంగం చూసి మూహూర్తాలు చెబుతుంటాడు. కందుకూరులోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 'తప్పిపోయిన కుమారుడు' నాటిక పుస్తకావిష్కరణ శనివారం జరగనుంది. ఇందులో నాగేశ్వరరావును సన్మానించనున్నారు.

పౌరాణిక నాటకాలు అంతరించిపోతున్నాయి



పౌరాణిక నాటకాలు అంతరించిపోతున్నాయి. బ్రహ్మంగారి నాటకం, చెంచులక్ష్మి, చింతామణి ప్రదర్శనలు కరువయ్యాయి. టీవీలు, సెల్‌ఫోన్లతో కాలం గడిపేస్తున్నారు. నాటకాలపై ఆసక్తి ఉన్న మాలాంటి వారు నేర్పిస్తామన్నా ఆసక్తి చూపడం లేదు. ఎక్కడో కొందరు మాత్రమే నేర్చుకుంటున్నారు.

– అవనిగడ్డ నాగేశ్వరరావు

ఆర్టీసీ బస్టాండ్‌లో గంజాయి స్వాధీనం

- పోలీస్ వాహనాన్ని చూసి ఇద్దరి పరారీ
- మరో ఇద్దరిని పట్టుకుని స్టేషన్‌కు తరలింపు

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు ప్రధాన ఆర్టీసీ బస్టాండ్‌లో గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు దాడులు చేశారు. పోలీసుల వాహనాన్ని చూసి ఇద్దరు నిందితులు పరారవగా ఇద్దరు చిక్కారు. శుక్రవారం చిన్నబజారు పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు నిందితుల వివరాలను వెల్లడించారు. తమిళనాడుకు చెందిన నాగప్పన్ మణికంఠ, ఓ బాలుడు మద్యం, గంజాయికి బానిసై నిత్యం మత్తులో తేలుతున్నారు. వారి వ్యసనాలను తీర్చుకునేందుకు సరిపడా నగదు కోసం గంజాయి విక్రయించాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా ఇప్పటికే విక్రయాలు చేస్తున్న చెన్నై సెంట్రల్‌కు చెందిన సూర్య, ఎలన్ జరియస్‌ను కలిశారు. అందరూ కలిసి ఈనెల 7వ తేదీ నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌లో కావలికి చేరుకున్నారు. అక్కడ గుర్తుతెలియని వ్యక్తి నుంచి రెండు కేజీల గంజాయిని కొనుగోలు చేశారు. అనంతరం నలుగురూ కలిసి ఆర్టీసీ బస్సులో నెల్లూరుకు వచ్చారు. చెన్నై వెళ్లేందుకు బస్సు కోసం వేచిచూడసాగారు.



వివరాలను వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు

పక్కా సమాచారంతో..

ఆర్టీసీ బస్టాండ్‌లో గంజాయి అక్రమ రవాణా జరుగుతోందని ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావుకు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు ఎస్సై అయ్యప్ప తన సిబ్బందితో కలిసి బస్టాండ్‌కు చేరుకున్నారు. పోలీసుల వాహనాన్ని చూసి నిందితులు పరారవగా వెంబడించారు. నాగప్పన్ మణికంఠ, మైనర్ బాలుడు చిక్కగా మరో ఇద్దరు మాత్రం పరారయ్యారు. పట్టుబడిన నిందితుల నుంచి రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మణికంఠను అరెస్ట్ చేయగా, బాలుడిని జువనైల్ హోంకు తరలించారు. మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ట్యాంకర్‌ను ఢీకొట్టిన మినీలారీ



రియాజ్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

- డ్రైవర్ మృతి

ఉలవపాడు: చెట్లకు నీరు పట్టే హైవే అథారిటీ ట్యాంకర్‌ను మినీలారీ ఢీకొట్టడంతో డ్రైవర్ మృతిచెందాడు. ఈ ఘటన జాతీయ రహదారిపై వీరేపల్లి జంక్షన్ వద్ద శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. తమిళనాడుకు చెందిన మినీలారీ చెన్నై నుంచి విజయవాడకు వెళ్తోంది. వీరేపల్లి వద్ద చెట్లకు ట్యాంకర్ ద్వారా నీరుపడుతున్నారు. మినీలారీ వేగంగా వచ్చి ట్యాంకర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. మినీలారీ డ్రైవర్ మహ్మద్ రియాజ్ (35)కు తీవ్రగాయాలయ్యాయి. 108 అంబులెన్స్ సిబ్బంది అతడిని కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఘటనా స్థలాన్ని ఎస్సై అంకమ్మ పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలలో ఉంచారు.

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం



మహమ్మద్ (ఫైల్)

- మరో వ్యక్తికి గాయాలు

మర్రిపాడు: మండల కేంద్రమైన మర్రిపాడు హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. ఆత్మకూరు మండలం రామస్వామిపల్లి నుంచి మోటార్‌బైక్‌పై మహమ్మద్ (20), ఆకాష్ బద్వేల్‌కు బయలుదేరారు. మర్రిపాడులోని నెల్లూరు – ముంబై జాతీయ రహదారి సమీపంలో హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో గుర్తుతెలియని లారీ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో మహమ్మద్ మృతిచెందగా ఆకాష్ గాయపడ్డాడు. సమాచారం అందుకున్న మర్రిపాడు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన లారీ ఆగకుండా వెళ్లిపోయింది.





సినీ సెట్ కాదు.. రియల్

ఈ చిత్రాలు చూసి ఏదో హర్రర్ సినిమాలో సెట్టింగ్ అనుకునేరు. కానే కాదు. నెల్లూరు మూలాపేటలోని పోలీస్ క్వార్టర్స్ ఇది. చెట్లు ఇలా బిల్డింగ్‌ను ఆక్రమించాయి. వేర్లు గోడల్లోకి చొచ్చుకుపోవడంతో కొత్త దృశ్యం ఆవిష్కృతమైంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు